క్లుప్తంగా

ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన

మద్దిపాడు: మండలంలోని లింగంగుంట గ్రామంలో మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. 375 మంది పాల్గొని పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. ప్రతి రోగికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆనంద మోహన్, శ్రావణ్, జగదీష్, హౌస్ సర్జన్లు సీహెచ్‌ఓ లలితమ్మ, సూపర్‌వైజర్ బాలకోటయ్య, హెచ్‌వీ నాగరాజి, సీత, వైద్యశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీడీపీ వార్డు మెంబర్ సుబ్బమ్మ రాజీనామా


రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న సుబ్బమ్మ

చీమకుర్తి రూరల్: మండలంలోని గాడిపర్తివారిపాలెం పంచాయతీ 8వ వార్డు మెంబర్ మార్నేని సుబ్బమ్మ రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలోని ఈఓఆర్డీకి మంగళవారం అందజేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసిన నారిపెద్ద వెంకట్రావు పార్టీ పదవులకు ఈ నెల 14వ తేదీ రాజీనామా చేశారు. అందుకు మద్దతుగా గాడిపర్తివారిపాలెం 8వ వార్డు సభ్యురాలు మార్నేని సుబ్బమ్మ రాజీనామా చేశారు.

పాఠశాలల్లో నాడు-నేడు పనుల పరిశీలన

కొత్తపట్నం: .మండలంలోని గవుళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాజుపాలెం ఎంపీయూపీ పాఠశాలలో నాడు-నేడు అభివృద్ధి పనులను మంగళవారం కేంద్రం నుంచి వచ్చిన ఇన్‌సైట్ డెవలప్‌మెంట్ కన్సల్టింగ్ గ్రూప్ (ఐడీసీజీ) బృందం పరిశీలించింది. ప్రపంచ బ్యాంక్ నుంచి వచ్చిన ఐడీసీజీ ప్రతినిధి సీహెచ్ ప్రవీణ్‌కుమార్ నాడు-నేడు పనులను పరిశీలించి వివరాలు సేకరించారు. తరగతి గదులు, పాఠశాల పరిసరాలు, బాత్‌రూంలు, గ్రీన్ బోర్డులు, డిజిటల్ బోర్డులు, మెడికల్ కిట్స్, వాల్ పెయింటింగ్, 2024లో పరీక్షలు జరిగే విధానాన్ని పరిశీలించారు. అన్నీ బాగుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీఈవో-2 టి.పద్మావతి, పాఠశాల హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, రాజేష్ పాల్గొన్నారు.

రైలులో 8 కేజీల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయితో రైల్వే జీఆర్‌పీ సీఐ శ్రీకాంత్‌బాబు, సిబ్బంది

ఒంగోలు సబర్బన్: ఒంగోలు రైల్వే సర్కిల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం మంగళవారం కోరమాండల్ సూపర్ ఫాస్ట్ రైలులో 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే జీఆర్‌పీ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు కోరమాండల్ సూపర్ ఫాస్ట్ రైలులో బీ-వన్ భోగీలో బాత్‌రూమ్ వద్ద గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. కోరమాండల్ హాల్ట్ ఒంగోలు రైల్వే స్టేషన్‌లో లేదు. అయినా ఉన్నతాధికారుల అనుమతితో రైలును ఒంగోలులో ఆపి తనిఖీ చేయగా 8 కేజీల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గంజాయిని అక్కడ పెట్టి వెళ్లినట్లు నిర్ధారించారు. తనిఖీల్లో ఆర్‌పీఎఫ్ సీఐ హీరా సింగ్, ఒంగోలు తహశీల్దార్ ఎం.సుజన్‌కుమార్, జీఆర్‌పీ సిబ్బంది కేవీ.రమణ, వి.శ్రీనివాసరావులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీకాంత్ బాబు తెలిపారు.

ఎథికల్ ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమం


ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్నికల అధికారులు

ఒంగోలు అర్బన్: స్థానిక ఎన్‌టీఆర్ కళాకేంద్రంలో సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఒంగోలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పలు శాఖల ఉద్యోగులకు ఎథికల్ ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీఆర్‌ఓలు, మహిళా పోలీసులు, ఇతర ఉద్యోగులతో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా పారదర్శకంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి బి.రవి, పీఎస్ జ్యోతి, నియోజకవర్గ నోడల్ అధికారి అయిన డీఎస్పీ, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు పాల్గొన్నారు.


బాలినేని, చెవిరెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు


ఎమ్మెల్యే బాలినేని, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


బాలినేని శ్రీకావ్యతో కలిసి వాసన్న కటౌట్లతో కార్యక్రమంలో పాల్గొన్న మహిళా నాయకులు


అభివాదం చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి

విజయీభవ...

వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి పరిచయ కార్యక్రమం మంగళవారం రాత్రి ఒంగోలు నగరంలో అట్టహాసంగా జరిగింది. ఒంగోలు నగరం, మండలానికి సంబంధించిన వైఎస్సార్ సీపీ శ్రేణులతో నిర్వహించిన కార్యక్రమానికి చెవిరెడ్డితో పాటు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తమ ప్రసంగాలతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొని విజయీభవ అంటూ నినదించారు. – ఒంగోలు సబర్బన్

రహదారుల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలి

- ఎస్ఈబీ అధికారులను ఆదేశించిన ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.శ్రీనివాసులు


ఎస్ఈబీ అధికారులతో సమీక్షిస్తున్న ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ (ట్రైనింగ్) శ్రీనివాసులు

ఒంగోలు సబర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రహదారుల వెంట ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ (ట్రైనింగ్) డాక్టర్ కే.శ్రీనివాసులు జిల్లా ఎస్ఈబీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఒంగోలులోని ఎస్ఈబీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమీక్షలో పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. తనిఖీలు ముమ్మరం చేసి అక్రమ మద్యం, నాటుసారా, గంజాయి వంటి మత్తు పదార్థాల అమ్మకం అరికట్టాలన్నారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ల వివరాలు, కేటాయించిన సిబ్బంది, స్టేషన్ నిర్వహణ, నమోదైన కేసులు, ఇతర ముఖ్య అంశాలపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సందర్భంగా మద్యం పంపిణీ నిమిత్తం లిక్కర్ నిల్వచేసి ఉంచే అక్రమ గోడౌన్‌లను గుర్తించాలన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పక్షపాత రహితంగా చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరూ పనిచేయాలని, షిఫ్ట్ డ్యూటీల వారీగా సిబ్బంది 24 గంటలూ పనిచేయాలన్నారు. జిల్లాలో నాటుసారా తయారీ, రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాటు సారా కాసే పాత నేరస్తులపై నిఘా కొనసాగించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎన్‌డీపీఎల్ లిక్కర్ జిల్లాలోకి అక్రమంగా ప్రవేశించకుండా గట్టి నిఘా పెంచి చెక్ పెట్టాలన్నారు. రైల్వే స్టేషన్లు, ఆర్‌టీసీ, ప్రైవేటు ట్రావెల్స్, పార్శిల్ కౌంటర్లు ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలన్నారు. పాత కేసుల్లోని నేరస్తులను బైండోవర్ చేయించుకోవాలన్నారు. సమీక్షలో ఈఎస్ రవి కుమార్, మార్కాపురం ఏఈఎస్ డీఎస్ దుర్గా ప్రసాద్, హెడ్ క్వార్టర్స్ ఏఈఎస్ జీ.నరశింహారావు, ఎస్ఈబీ సీఐలు, డీటీఎఫ్ ఎస్సైలు, ఇంటెలిజెన్స్ వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎన్ పాడు నియోజకవర్గంలో 2,14,265 మంది ఓటర్లు


ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపాలకృష్ణ

చీమకుర్తి: సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో 2,14,265 మంది ఓటర్లు నమోదైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలు వెల్లడించారు. మొత్తం ఓటర్లలో స్త్రీలు 1,08,972 మంది, పురుషులు 1,05,289 మంది, ట్రాన్స్‌జెండర్లు నలుగురు ఉన్నట్లు వివరించారు. ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6ను స్వీకరించడం ఆపేసినట్లు తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోటీచేసే అభ్యర్థుల నుంచి ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25 నామినేషన్లు స్వీకరించేందుకు చివరి తేదీ అన్నారు. నామినేషన్లను చీమకుర్తిలోని నూతన మున్సిపల్ కార్యాలయ భవనంలో స్వీకరిస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. మధ్యలో ఆదివారం తప్ప 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్లు సమర్పించేందుకు వచ్చే అభ్యర్థులకు సంబంధించి 3 వాహనాలు, ఐదుగురు సభ్యులను మాత్రమే 100 మీటర్ల పరిధిలోపల అనుమతిస్తామన్నారు. ఒకేసారి ఇద్దరుకు మించి అభ్యర్థులు వస్తే ఒకరి నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నప్పుడు మిగిలిన వారిని వెయిటింగ్ హాలులో ఉంచే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కార్యాలయ ప్రాంగణంలో డీఎస్పీ స్థాయి అధికారి ద్వారా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తారన్నారు.

వలంటీర్ల రాజీనామా


31వ డివిజన్‌లో రాజీనామాలు చేస్తున్న వలంటీర్లతో వైఎస్సార్‌సీపీ నాయకుడు తన్నీరు నాగేశ్వరరావు


గోపాల్‌నగర్‌లో రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు


రాజీనామా పత్రాలు అందజేస్తున్న కరవది వలంటీర్లు


రాజీనామా పత్రాలు అందజేస్తున్న మండువారిపాలెం వలంటీర్లు

ఒంగోలు సబర్బన్: వలంటీర్లను అవమానించేలా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు, ప్రజలకు వలంటీర్లు సంక్షేమ పథకాలు అందించకుండా చేస్తున్న కుట్రలకు నిరసనగా వారు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. నగరంలోని 31వ డివిజన్‌లో పనిచేస్తున్న వలంటీర్లు మూకుమ్మడిగా మంగళవారం రాజీనామాలు చేశారు. డివిజన్‌లో పనిచేస్తున్న 31 మంది వలంటీర్లు స్థానిక కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక సచివాలయ అడ్మిన్‌కు వారి రాజీనామా పత్రాలు అందజేశారు.

గోపాల్‌నగర్‌లో 30 మంది వలంటీర్లు రాజీనామా...

ఒంగోలు టౌన్: నగరంలోని గోపాల్‌నగర్ 7, 8 సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 30 మంది వలంటీర్లు స్థానిక కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావు, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాజీనామాలు చేశారు. ఆయా సచివాలయాల అడ్మిన్లకు రాజీనామా పత్రాలు అందజేశారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవచేశామని, ఐదేళ్లుగా ప్రజలు-ప్రభుత్వానికి వారధిగా పనిచేశామని, అలాంటి తమపై టీడీపీ, జనసేన నాయకులు అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం బాధించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి విజయం కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నామన్నారు.

28 మంది వలంటీర్ల రాజీనామా

ఒంగోలు రూరల్ : మండలంలోని మండువవారిపాలెంలో 9 మంది, కరవది గ్రామంలో 19 మంది కలిపి మొత్తం 28 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులకు రాజీనామా పత్రాలు అందజేశారు. చంద్రబాబు వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు, చేయిస్తున్న కుట్రలకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విజయం కోసం పనిచేస్తామని వారు తెలిపారు.

సమాజసేవ కోసం ఆస్తిని ధారపోసిన కందుకూరి


కందుకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పేరయ్య, తదితరులు

ఒంగోలు టౌన్: సమాజసేవ కోసం తన యావదాస్తిని ధారపోసిన త్యాగమూర్తి కందుకూరి వీరేశలింగం లాంటి యుగకర్తలు చాలా అరుదుగా జన్మిస్తారని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య అన్నారు. సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం 176వ జయంతిని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కందుకూరి జీవిత విశేషాలను పేరయ్య వివరించారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆయన తూ.చ. పాటించారని చెప్పారు. మహిళల విద్య కోసం ఉద్యమాలు నిర్వహించారని, బాలికల కోసం పాఠశాలను స్థాపించారని తెలిపారు. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు అహర్నిశలు కృషి చేశారని, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పని చేశారని చెప్పారు. సమాజ చైతన్యం కోసం అనేక రచనలు చేసిన ఆయన.. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. ఒక మంచి పుస్తకం కొనుక్కో అని నినదించారని అన్నారు. కందుకూరి ఆశయాలను, ఆలోచనలను కొనసాగించాల్సిన అవసరం నేడు కూడా ఎంతో ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణమ్మ, కృష్ణవేణి, సందీప్, శాంసన్, మృదుల్ కుమార్, ఎన్.ఆంజనేయులు పాల్గొన్నారు.

శ్లాస్ పరీక్షను తనిఖీ చేసిన డీఈఓ


పరీక్ష తీరును పరిశీలిస్తున్న డీఈఓ సుభద్ర

సంతనూతలపాడు (చీమకుర్తి): స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో 4వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే (శ్లాస్) పరీక్షను సంతనూతలపాడు మండలంలో డీఈఓ డి.సుభద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైనంపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శ్లాస్ పరీక్ష కేవలం విద్యార్థుల స్థాయిని అంచనా వేసి భవిష్యత్తులో వారికి ఏ విధమైన బోధన అందించాలనే దానిపై నిర్ణయం తీసుకునేందుకు ఉద్దేశించిందని తెలిపారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులను ఇంగ్లిష్, తెలుగు భాషల్లో చదివించడం, రాయించడం చేయగలిగేలా చతుర్విధ ప్రక్రియలను నేర్పగలిగేలా తగిన బోధన చేయాలని డీఈఓ కోరారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ సందర్శించి ఇటీవల వచ్చిన ఇంటర్ ఫలితాలపై హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఫెయిలైన విద్యార్థులంతా త్వరలో జరగబోయే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధించాలని ఆదేశించారు. ప్రతి ఓటరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలనే ప్రతిజ్ఞ పత్రాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సేకరించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేశామని, విద్యార్థులతో వర్క్ బుక్స్, నోట్ బుక్స్ పూర్తి చేయించామని డిక్లరేషన్ సమర్పించాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం జరిగిన వివిధ పరీక్షల్లో విద్యార్థులు పొందిన మార్కులను ఈ నెల 18వ తేదీలోగా స్టూడెంట్ ఇన్ఫో సైట్లో నమోదు చేసి సబ్మిట్ చేయాలని కోరారు. ఈ నెల 18వ తేదీ లోపు ఫౌండేషన్ పాఠశాలల్లో, ప్రాథమిక పాఠశాలల్లో, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వరుసగా 2, 5, 7, 8 తరగతులు చదువుతున్న విద్యార్థులను వచ్చే విద్యా సంవత్సరం ఏ పాఠశాలలో చేర్చాలని తల్లిదండ్రులు భావిస్తున్నారో తల్లిదండ్రుల నుంచి డిక్లరేషన్ తీసుకుని స్టూడెంట్ ఇన్ఫో సైట్లో మ్యాపింగ్ పూర్తి చేయాలని డీఈఓ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.వెంకారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన శంకర విజయం నృత్యరూపకం


నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఒంగోలు మెట్రో: వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ధర్మపథం వేదికపై నళినీప్రియ కూచిపూడి నృత్యానికేతన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శంకర విజయం నృత్యరూపకం ప్రేక్షకులను అలరించింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.ఎస్.రామారావు మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలతో యువతలో సాంస్కృతిక విలువలు ఏర్పడతాయన్నారు. జగద్గురు శంకరాచార్యుల వారు కేవలం 32 సంవత్సరాల వయసులో సాధించిన ధార్మిక ప్రగతిని నేటితరం అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ నృత్య రూపకానికి ఎస్వీ శివకుమారి దర్శకత్వం వహించగా, రచన నెమ్మాని సీతారామమూర్తి, సంగీతం శాంతి, జై బాలార్క అందించారు. జగద్గురు శంకరాచార్యస్వామి జీవితాన్ని సంపూర్ణంగా కళాకారులు ప్రదర్శించడం విశేషం. స్వామి కాలడిలో జన్మించింది మొదలు, కనకధారా స్తోత్రం చేయడం, సన్యాసం స్వీకరించడం, గోవిందపాదుల వారి శిష్యులుగా మారడం, వివిధ ప్రకరణ గ్రంథాలు, వేదాంత భాష్యాలు, స్తోత్రాలు అందించటం మొదలైన వాటిని సవివరంగా తెలిపారు. ప్రధానంగా శంకరాచార్యస్వామి వివిధ సిద్ధాంతాలను ఖండించి చివరిగా స్వామివారు కాశ్మీర దేశంలో సర్వజ్ఞ పీఠం అధిష్టించడం, దేశానికి నాలుగు దిక్కుల పీఠాలను ఏర్పాటు చేయడం మొదలైన అంశాలను ప్రదర్శించారు. వైదిక మండలి సభ్యుడు రంగా వఝల శ్రీనివాసశాస్త్రి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసు కొట్టివేత

మార్కాపురంటౌన్: దొనకొండ మండలం రాగమక్కపల్లిలో పిడిపోగు ప్రభుకుమార్, చెన్నమ్మ, శ్రీరాం సంతోషమ్మలపై నమోదైన వరకట్న వేధింపు హత్య కేసు కొట్టివేస్తూ ఆరో అదనపు న్యాయమూర్తి ఎం శుభవాణి మంగళవారం తీర్పుచెప్పినట్లు న్యాయవాది ఎం శ్రీరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే మార్కాపురం మండలం జమ్మనపల్లి గ్రామానికి చెందిన పిడిపోగు కరుణమ్మను దొనకొండ మండలం రాగమక్కపల్లికి చెందిన ప్రభుకుమార్‌తో వివాహమైంది. అయితే కరుణమ్మ 2009 మే 11న మృతి చెందింది. మృతురాలి తండ్రి పెద్దసుబ్బయ్య తన కూతురిని వరకట్న వేధింపులకు గురిచేసి హత్య చేశారని దొనకొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మంగళవారం జరిగిన తుది విచారణలో నిందితులపై మోపిన నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పినట్లు న్యాయవాది శ్రీరామిరెడ్డి తెలిపారు.

మాదిగలను మోసం చేసింది చంద్రబాబే

- 10 ఏళ్లు అధికారంలో ఉన్న బీజేపీ వర్గీకరణ ఎందుకు చేయలేదు?
- వందశాతం హామీలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే
- 600 హామీలిచ్చి ఒక్కటీ అమలు చేయని వ్యక్తి చంద్రబాబు
- మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ


మాట్లాడుతున్న కొమ్మూరి కనకారావు మాదిగ

దర్శి: మాదిగలను మోసం చేసింది చంద్రబాబు, కృష్ణమాదిగ, బీజేపీ పార్టీలే అని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 100 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అయితే..600 హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయని వ్యక్తి చంద్రబాబు అన్నారు. 40 ఏళ్ల చంద్రబాబు రాజకీయ జీవితంలో చెప్పుకోవడానికి ఏం లేక రాజకీయ పార్టీలను, కులసంఘాలను వెంటపెట్టుకుని ఓట్లడుగుతుంటే... సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీకు మేలు జరిగితేనే నాకు ఓటేయండని ధైర్యంగా అడుగుతున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మోసం చేసింది చంద్రబాబు, బీజేపీ, మందకృష్ణ మాదిగలే అని చెప్పారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ఎందుకు ఎస్సీ వర్గీకరణ చేయలేదని ప్రశ్నించారు. చంద్రబాబు పెంపుడు వృక్షం మందకృష్ణ మాదిగ అని స్పష్టం చేశారు. 2014 నుంచి 2019వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు 40సార్లు ఢిల్లీ వెళ్లి వర్గీకరణ విషయం అడిగారా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను అణగదొక్కాలనే చంద్రబాబు కుట్రలో మందకృష్ణ మాదిగ పావుగా మారారన్నారు. అబద్ధానికి..వాస్తవానికి, నీతికి..నిజాయితీకి మధ్య జరుగుతున్న యుద్ధమే ఈ ఎన్నికలు అని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, బీసీ, ఎస్టీ మైనార్టీలకు అన్ని విధాలా న్యాయం చేశారన్నారు. ఎన్నికల ముందు ప్రజల్లోకి వచ్చి ఓట్లు అడుగుతున్న మందకృష్ణ, చంద్రబాబు, బీజేపీల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, ముండ్లమూరు జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, గర్నెపూడి సామ్యేల్, కొడవటి జాన్, కె.సన్నీబాబు, తదితరులు పాల్గొన్నారు.